# రూ.817కోట్లతో సత్యవాణి కొత్త ప్రాజెక్టులు

బిజినెస్‌బ్యూరో, న్యూస్‌లైన్:



రియల్ ఎస్టేట్ రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హైదరాబాద్ సంస్థ సత్యవాణి ప్రాజెక్ట్స్ అండ్ కన్సల్టెంట్స్ భవిష్యత్తు విస్తరణకు అవసరమైన నిధుల కోసం అన్వేషణలో పడింది. హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరుల్లో కొత్తగా చేపట్టబోయే ఐదు ప్రాజెక్టుల కోసం దాదాపు 190 మిలియన్ డాలర్లు (రూ.817 కోట్లు) పెట్టేందుకు కంపెనీ నిర్ణయించింది. తమ అనుబంధ సంస్థ సత్యవాణి గ్రీన్‌హోమ్స్ పేరుతో కంపెనీ ఇప్పటికే హైదరాబాద్‌లో నాలుగు ప్రాజెక్టులను చేపడుతోంది. భవిష్యత్తు విస్తరణకు అవసరమైన నిధులలో అత్యధిక మొత్తాన్ని... దాదాపు రూ. 645 కోట్ల మేరకు ప్రైవేట్ ఈక్విటీ రూపంలో సమీకరించేందుకు యోచిస్తున్నట్లు కంపెనీ డైరెక్టర్ పి.సూర్యప్రకాష్ వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే యూరోపియన్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(ఆర్ఈఐటీ)తో చర్చలు ప్రారంభించినట్లు 'న్యూస్‌లైన్'కు తెలిపారు. ఈ సంస్థల పేర్లను వెల్లడించేందుకు మాత్రం ఆయన నిరాకరించారు. భవిష్యత్తు ప్రాజెక్టులను గురించి ప్రస్తావిస్తూ... హైదరాబాద్‌లో 50 లక్షల చదరపు అడుగుల స్థలంలో ఏర్పాటు చేస్తోన్న మెడికల్ టూరిజం ప్రాజెక్టులో రెండు ఆసుపత్రులు, ఒక హెల్త్ రిసార్ట్, సర్వీస్ అపార్ట్‌మెంట్లను నిర్మిస్తామన్నారు. దీనిపై రూ. 516 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు సూర్యప్రకాష్ తెలిపారు. రూ. 86 కోట్ల వ్యయంతో విశాఖపట్నంలో రెసిడెన్షియల్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ. 215 కోట్ల పెట్టుబడితో బెంగుళూరులో ఒక ఎకో రిసార్ట్‌ను, మరో హౌసింగ్ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు వివరించారు. సత్యవాణి గ్రీన్‌హోమ్స్ ప్రాజెక్టులకు సంబంధించి ఈ ఏడాది ప్రారంభంలోనే కంపెనీకి బ్రిటన్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ అమిటేయస్ ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి దాదాపు రూ. 43 కోట్ల విలువైన ఫండింగ్ లభించింది.